

## 21 వరకు గడువు పొడిగింపు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గాను కేజీబీవీల్లో ఇంటర్ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణకు ఈనెల 21వరకు పొడిగించినట్లు సమగ్ర శిక్షా ఏపీసీ ప్రేమంత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఏపీసీ మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 11తో ముగిసిందని, అయితే తేదీని పొడిగించినట్లు తెలిపారు. బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# అడ్రస్ లేని అనుబంధ యూనిట్లు

ప్యాపిలి వద్ద సమీకృత మార్కెట్‌కు కేటాయించిన భూమి



వ్యవసాయానికి అనుబంధ పరిశ్రమలను నెలకొల్పి రైతులను మార్కెట్ ఒడిదుడుకుల నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉంది. కానీ గత వైసీపీ ప్రభుత్వం ఈ విషయంలో రూ.కోట్లు కేటాయించినట్లు కాగితాల మీద ప్రకటనలు చేసి రైతులను దగా చేసిందనే విమర్శలు ఉన్నాయి. జనాభా ఆహార అవసరాలన్నీ తీర్చడానికి ఫుడ్ ప్రాసెసింగ్ రంగం కీలకమని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మన జిల్లాలో అత్యధికంగా సాగయ్యే ఉల్లి, టమోటా, అరటి వంటివి రైతుల నుంచి వినియోగదారులకు చేరే లోపు దాదాపు 30శాతం ఉత్పత్తులను నష్టపోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో దిగుబడులను ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా ఉప ఉత్పత్తులుగా మారిస్తే రైతులకు, వినియోగదారులకు లాభసాటిగా ఉంటుంది.

- పేపర్లకే పరిమితమైన వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు
- రూ.కోట్లు మంజూరంటూ రైతులను మభ్యపెట్టిన వైసీపీ ప్రభుత్వం
- భూముల సేకరణకే పరిమితం
- ప్యాపిలిలో సమీకృత మార్కెట్ సముదాయమేదీ....?
- మెట్టుపల్లిలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఎక్కడ.?
- కలగా రాయమాల్పురంలో మిల్లెట్ ప్రాసెసింగ్

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగవుతున్న పండ్లు, పూలు, కూరగాయలతో పాటు చేపలు ఇలా అన్ని రకాల ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థను ఒకేచోట ఏర్పాటు చేయడం సమీకృత సముదాయ మార్కెట్ ఉద్దేశం. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022వ సంవత్సరంలో ప్యాపిలి వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న 29.5 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ మార్కెట్ మంజూరు అంటూ అధికారులను పరుగులు పెట్టించారు. సమీకృత మార్కెట్ సముదాయంలో 36 హోల్‌సేల్ షాపులు, 20 సెమీ రిటైల్ షాపులు, 66 రిటైల్ షాపులు, రెండు రైపనింగ్ ఛాంబర్లు, 4 కోల్డ్ స్టోరేజీలు, ఒక ప్రాసెసింగ్ బ్లాక్, ఒక ఆర్‌వో ప్లాంటు, వేబ్రిడ్జి, లక్ష లీటర్ల కెపాసిటీ కల్గిన ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి రూ.49.7 కోట్లతో అంచనాలు రూపొందించారు. ప్యాపిలి చుట్టూ ఉన్న మండలాలతో పాటు కర్నూలు, అనంతపురం, కడప, సత్యసాయి జిల్లాల రైతులకు ఉపయోగంలోకి వస్తుందని ప్రచారం చేశారు. కేవలం ప్రచారానికే పరిమితమైంది. ప్రధానంగా జిల్లాలో 53,029 హెక్టార్లలో 12,57,442 టన్నుల ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. టెర్మినల్ మార్కెట్ జిల్లా రైతులకు ఎంతో తోడ్పాటునిస్తుందని తెలిసినా వైసీపీ ప్రభుత్వం పేపర్లకే పరిమితం చేసి చేతులు దులుపుకుంది.

### టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏదీ..

ప్యాపిలి మండలం మెట్టుపల్లి వద్ద టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పుతామని, ఇక టమోటో రైతులకు కష్టనష్టాలుండవని గత వైసీపీ ప్రభుత్వం ఊదరగొట్టింది. 2022 ఆగస్టు నెలలో 15 ఎకరాల భూమిని కూడా కేటాయించింది. . ఇంకేముందీ భూమిని కేటాయించేశాం, రూ.75 కోట్లు మంజూరు చేశాం...అదిగో టమోటో ప్రాసెసింగ్ యూనిట్..ఇదిగో వచ్చేస్తోందంటూ రోజులు గడిపారు. ఇదంతా తెల్లపేపర్లకే పరిమితమైంది. జిల్లాలో అత్యధికంగా ప్యాపిలి మండలంలో 2100 హెక్టార్లలో 94500 టన్నులు, డోన్ మండలంలో 1200 హెక్టార్లలో 54000 టన్నులు, బేతంచర్ల మండలంలో 202 హెక్టార్లలో 9099 టన్నుల టమోటా సాగవుతోంది. జిల్లా వ్యాప్తంగా 3612 హెక్టార్లలో 2లక్షల టన్నుల టమోటో దిగుబడి వస్తోంది. టమోటా ఒక్కోసారి కిలో రూ.1 కే పడిపోవడం, మరో సందర్భంలో రూ.100కు చేరుకోవడం వంటి భారీ హెచ్చుతగ్గులు రైతులను కష్టాల పాలు చేస్తోంది. అలాంటి రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలంటే విరివిగా ప్రాసెసింగ్ యూనిట్‌లు నెలకొల్పి కెచప్, సాస్‌వంటి ఉత్పత్తుల తయారీని చేపట్టి ఆదుకోవాల్సిన అవసరం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలో ఒక్క ప్రాసెసింగ్ యూనిట్‌ను కూడా మంజూరు చేయలేదు. మంజూరు చేసినట్లు జీవోలు తప్ప, ఎక్కడా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం రైతు అనుబంధ పరిశ్రమలపై దృష్టిసారించి ఏడాదిలోపే పత్తికొండలో టమోటో ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పేందుకు ఇటీవలే భూమిపూజ చేశారు. నిధులను మంజూరుచేశారు.




నంద్యాల మండలంలోని రాయమాల్పురం వద్ద ఏపీ విత్తనాభివృద్ధి సంస్థకు కేటాయించిన స్థలం

### మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏదీ...?

నంద్యాల ప్రాంతంలో అత్యధికంగా చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు, సామెలు, ఊదలు పండిస్తున్నారు. ఈ ప్రాంతంలో గత ప్రభుత్వం నంద్యాల మండలం రాయమాల్పురం వద్ద మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను మంజూరు చేస్తున్నామంటూ జీవోలు విడుదల చేశారు. అక్కడ ఉన్న నేషనల్ సీడ్ కార్పొరేషన్‌కు చెందిన 50 సెంట్ల భూమిని కేటాయించారు. రూ.100 కోట్లతో యూనిట్‌ను నెలకొల్పుతున్నామనే ప్రకటనలకే పరిమితమయ్యారు. ఐదేళ్ల అధికారంలో ఉన్నా ఒక్క పైసా కూడా మంజూరు చేయలేదు. కేవలం పేపర్లకే పరిమితమైంది. జిల్లాలో 1,01,619 హెక్టార్లలో చిరుధాన్యాలు సాగు చేస్తుండగా 1,98,243 టన్నులు దిగుబడి వస్తోంది. దీంతో జిల్లాలో నంద్యాల ప్రాంతంలో మిల్లెట్ పరిశ్రమను నెలకొల్పాల్సిన అవసరం ఉంది.

### అనుబంధ పరిశ్రమల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



జిల్లాలో భూములు కేటాయించి నిలిచిపోయిన టెర్మినల్ మార్కెట్, ప్రాసెసింగ్ యూనిట్‌ల గురించి ఇప్పటికే నివేదికలు తయారు చేశాం. త్వరలోనే పత్తికొండలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను పూర్తిచేస్తాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ప్యాపిలి వద్ద కూడా నెలకొల్పేందుకు సిద్ధంగా ఉన్నాం. మిల్లెట్‌లకు కూడా అత్యధిక ప్రాధాన్యత ఉంది.

-నాగరాజు, జిల్లా ఉద్యానశాఖ అధికారి, నంద్యాల

### టెర్మినల్ మార్కెట్ ఏర్పాటు చేయాలి



పంటలు పండిస్తున్నా సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాము. నాగపూర్, చెన్నై, ముంబాయ్ మార్కెట్‌లకు వెళ్లి అక్కడ అరటిని విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. జిల్లాకు కేంద్రంగా ఉన్న ప్యాపిలిలో టెర్మినల్ మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

- లక్ష్మీనారాయణ యాదవ్, అరటి రైతు, చంద్రపల్లి, ప్యాపిలి మండలం

### దళారులకు అమ్ముకుంటున్నాం



జిల్లాలో సరైన మార్కెట్ సౌకర్యం లేక పంటలను దళారులకు అమ్ముకుంటున్నాం. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ప్యాపిలిలో టెర్మినల్ మార్కెట్ నిర్మిస్తే పండ్ల తోటల రైతులకు మేలు జరుగుతుంది.

-రాజశేఖర్‌నాయుడు, రైతు, నల్లమేకలపల్లి, ప్యాపిలి మండలం

## సామాజిక దార్శనికుడు పూలే
### మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిబా పూలే అని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కొనియాడారు. పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఉన్న జ్యోతిబా పూలే విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బొమ్మలసత్రం సమీకృత హాస్టల్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి పాల్గొని పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ అంటరానితనం, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్పవ్యక్తి పూలే అన్నారు. మహిళలు చదువుకుంటే అసమానతలు తొలగిపోతాయని భావించి మెదట తన భార్య సావిత్రీబాయి పూలేని విద్యావంతురాలిని చేసిన గొప్ప మానవతావాది అని కొనియాడారు.



జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి, కలెక్టర్

### నివాళులర్పించిన ఎస్పీ

నంద్యాల టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): యువత జ్యోతిబా పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పూలే జయంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల నిబంధనలకు వ్యతిరేకంగా పూలే ఉద్యమాలు చేశారన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ఆయన పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ యుగంధర్‌బాబు, సిబ్బంది కృష్ణారెడ్డి, సాయిధ బలగాలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతిబా పూలే చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ, పోలీసు సిబ్బంది

## పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి

నంద్యాల టౌన్ ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సిబ్బంది కోసం గ్రీవేన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ విభాగాలకు చెందిన పోలీసు సిబ్బంది బదిలీలు మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీలు, వాటిపై స్వయంగా వారి సమస్యలు విని వారికి తగిన పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చామన్నారు. వారి సమస్యల కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి
### కలెక్టర్ రాజకుమారి




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మే నెలాఖరుకు కేటాయించిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ రాజకుమారి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహనిర్మాణాల ప్రగతిపై ఆమె సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాల్లో జిల్లా ప్రగతి రాష్ట్రంలో దిగువస్థానంలో ఉందని, మే నెలాఖరుకు పూర్తిచేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలు గృహ నిర్మాణాల ప్రగతిలో ముందంజలో ఉండగా నంద్యాల జిల్లా దిగువస్థానంలో ఉండటానికి కారణాలేమిటని ఆమె సిబ్బందిని ప్రశ్నించారు. నంద్యాల రూరల్, అర్బన్, ఆత్మకూరు అర్బన్, ఆళ్లగడ్డ అర్బన్, డోన్ అర్బన్, వెలుగోడు, నందికొట్కూరు, గోస్పాడు, పాములపాడు, కోవెలకుంట్ల తదితర 14మండలాలు 20శాతం కన్నా తక్కువ ప్రగతి సాధించాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. సమీక్షలో హౌసింగ్ ఈఈ శ్రీహరిగోపాల్ పాల్గొన్నారు.

# టెన్షన్..టెన్షన్..!

- నేడు ఇంటర్ ఫలితాలు విడుదల
- ఎదురుచూస్తున్న 29,092 మంది విద్యార్థులు
- ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరిగేనా..?



నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు పూర్తయిన 20 రోజులకే అత్యంత వేగంగా ఇంటర్మీడియట్ ఫలితాలను విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. శనివారం ఉదయం 11 గంటలకు ఫలితాలను విడుదల చేస్తున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు వెల్లడించింది. ఇప్పటికే మూల్యాంకనం, రీ వెరిఫికేషన్, కంప్యూటరీకరణ తదితర ప్రక్రియలను చేపట్టి ఫలితాల విడుదల సిద్ధమయ్యారు. జిల్లాలో ఈ ఏడాది 15,692 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 13,400 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాశారు. వారందరూ ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇంటర్ బోర్డు అధికారిక వైబ్‌సైట్‌తో పాటు ఇటీవల ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మన మిత్ర వాట్సాప్ ద్వారా ఫలితాలు అందుబాటులోకి రానున్నాయి.

### మన మిత్ర ద్వారా ఇలా..

**స్టెప్ 1:** ఏపీ వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 9552300009కు హాయ్ అని మెసేజ్ పంపాలి.
**స్టెప్ 2:** ఆ తర్వాత సెలెక్ట్ సర్వీస్‌లో విద్యాసేవలు ఎంచుకోవాలి.
**స్టెప్ 3:** డౌన్‌లోడ్ ఏపీ ఇంటర్ ఫలితాలు-2025 ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
**స్టెప్ 4:** మార్కుల మెమో పొందడానికి మీ హాల్‌టికెట్ నంబర్‌ను నమోదు చేయాలి.
**స్టెప్ 5:** పీడీఎఫ్ రూపంలో ఫలితాలు కనిపిస్తాయి.

ఏపీ ఇంటర్మీడియట్ బోర్డు వెబ్‌సైట్ : resultsbie.ap.gov.in

### ఉత్తీర్ణత శాతం పెరిగేనా...?

2023-24 విద్యాసంవత్సరంలో నంద్యాల జిల్లాలో 12,022 మంది ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయగా 7,102 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అలాగే 9,165 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయగా 6,429 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా 56 శాతం ఉత్తీర్ణతతో నంద్యాల జిల్లా 13వ స్థానంలో నిలిచింది. 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 45.56 శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 64.87 శాతం ఉత్తీర్ణత సాధించారు. 57 ప్రైవేట్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 59.89 శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 68.99 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యరు. 19 మోడల్ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 60.44 శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 72.67 శాతం ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా గతేడాది జిల్లాలోని 24 ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 60.04 శాతం, ద్వితీయ సంవత్సరంలో 70.04 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తంమీద ఈ ఏడాది జిల్లాలో మరింత ఉత్తీర్ణత శాతం మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### నేడు సెలవు మినహాయింపు

నంద్యాల రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రెండో శనివారం అయినప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు యథావిధిగా కొనసాగుతాయని నంద్యాల సబ్ రిజిస్ట్రార్ చంద్రమౌళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవురోజుల్లో ప్రత్యేకంగా రూ.5వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునే విధానం అమల్లో ఉండేదన్నారు. కానీ రెండో శనివారం మాత్రం ఎలాంటి అదనపు రుసుం చెల్లించకుండానే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 65 ఎకరాల్లో నేలకూలిన అరటి చెట్లు



అరటి తోటను పరిశీలిస్తున్న నాగరాజు

మహానంది, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజుల నుండి వీచిన ఈదురుగాలులకు మహానంది మండలంలో 65 ఎకరాల్లో అరటిపంటకు నష్టం జరిగిందని జిల్లా ఉద్యానవన శాఖాధికారి నాగరాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎం. తిమ్మాపురం, బుక్కాపురం, మహానంది సమీపంలో ఇటీవల వీచిన ఈదురుగాలులకు నేలకూలిన అరటితోటలను ఆయన పరిశీలించారు. ఇప్పటికే పంట నష్టం పరిహారం కోసం ఉన్నతాధికార్లకు నివేదికలను పంపించామని అన్నారు.

# మనసారా నవోదయం..!



కల్లూరు మండలం ఎర్రకత్వతండాలో అవగాహన సభలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు

- నాటు సారా రహిత రాష్ట్రమే చంద్రబాబు లక్ష్యం
- పక్కాగా నవోదయం 2.0 అమలుకు శ్రీకారం
- 110 గ్రామాల్లో నాటు సారా తయారీ, అమ్మకాలు
- మూడు కేటగిరీలుగా విభజన

కర్నూలు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఆరోగ్యాన్ని హానికరం చేసే నాటుసారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపడమే కాకుండా 'నవోదయం 2.0' పేరుతో నాటుసారా రహిత రాష్ట్రంగా మార్చేందుకు సంకల్పించారు. కర్నూలు జిల్లాలో 110 గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో నాటు సారా తయారీ, విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించారు. నవోదయం 2.0 అమలుతో నాటుసారా రహిత గ్రామాలే లక్ష్యంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అవగాహన సదస్సులు చేపట్టారు. జిల్లాలో పలు గ్రామాలు సాటునారా తయారీ కేంద్రాలుగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం అమ్మకాల్లో తీసుకొచ్చిన సమూల మార్పుల కారణంగా అమ్మకాలు పెరిగాయి. గత ప్రభుత్వంలో నెలకు సగటున రూ.65-70 కోట్ల మద్యం అమ్మకాలు చేస్తే.. ప్రస్తుతం రూ.90-95 కోట్లకు చేరిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు. నాటుసారా వైపు వెళ్లకుండా కార్టర్ రూ.99కే నాణ్యమైన లిక్కరును అందుబాటులోకి తెచ్చారు.

### 110 గ్రామాలపై దృష్టి

కూటమి ప్రభుత్వం సాటుసారా రహిత గ్రామాలే లక్ష్యంగా నవోదయం 2.0 అమలుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో సారా తయారీ, అమ్మకాలు చేసే 110 గ్రామాలు, పట్టణ ప్రాంతాలు గుర్తించి మూడు కేటగిరీలుగా విభజించారు. పక్కాగా అమలు కోసం పోలీస్, రెవిన్యూ, అటవీ శాఖ అధికారులను భాగస్వామ్యం చేశారు.

- సారా తయారీకే పరిమితమైన గ్రామాలను 'ఏ' కేటగిరీలో చేర్చారు. కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు, వెల్దుర్తి, ఆదోని, ఆలూరు, హొళగుంద, పత్తికొండ, తుగ్గలి మద్దికెర, దేవనకొండ మండలాల్లో 25 గ్రామాలను గుర్తించారు.
- తయారీతో పాటు విక్రయాలు సాగించే గ్రామాలను బీ కేటగిరీలో చేర్చారు. ఆస్పరి, మంత్రాలయం, కోసిగి, పెద్దకడుబూరు, పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, దేనవకొండ, కర్నూలు, ఓర్వకల్లు, కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో 25 గ్రామాలు గుర్తించారు.
- కేవలం నాటుసారా అమ్మకాలు చేసే గ్రామాలను సీ కేటగిరీ కింద చేర్చారు. కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు, కృష్ణగిరి, వెల్దుర్తి, ఆస్పరి, కోసిగి, పెద్దకడుబూరు, పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, దేవనకొండ, గోనేగండ్ల మండల్లాల్లో 60 గ్రామాలు గుర్తించారు.

### సారా మానేస్తే జీవితాల్లో నవోదయం

రాష్ట్రం నాటుసారా రహిత ఏపీగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం 'నవోదయం 2.0' అమలుకు శ్రీకారం చుట్టింది. తయారీ, అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించిన గ్రామాల్లో నాలుగు దశల్లో కార్యక్రమాల అమలుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

- **సంసిద్ధం:** తొలి దశలో సారా తయారీ, అమ్మకందారులను గుర్తించాలి. వారిలో సంపూర్ణ అవగాహన కల్పించడం, ఇక నుంచి నాటుసారా తయారీ, అమ్మకాలు చేయబోమని వారిని సంసిద్ధం చేయడం. ఇందుకోసం గ్రామాల్లో గ్రామ సభలు, అవగాహన సదస్సులు, నారా వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య సమస్యలపై కళాజాతల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 500 మంది వరకు తయారీ, అమ్మకందారులు ఉన్నట్లు గుర్తించారు.
- **దాడులు:** రెండో దశలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన గ్రామాల్లో మళ్లీ సారా తయారీ, అమ్మకాలు చేస్తుంటే దాడులు చేయడం. ఇప్పటివరకు 17 కేసులు నమోదు చేసి 18 మందిని అరెస్టు చేశారు. 106 లీటర్లు సారా, 3,640 లీటర్లు బెల్లం ఊట ధ్వంసం చేశారు. దాడులు కొనసాగుతున్నాయి.
- **పునరావాసం:** మూడో దశలో గుర్తించిన సారా తయారీ, అమ్మకందారులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించడం. వారికున్న నైపుణ్యానికి అనుగుణంగా ఆటోలు, పాడి పరిశ్రమ, వ్యవసాయం, వ్యాపారం.. వంటి వాటికి రుణసౌకర్యం.
- **డిక్లరేషన్:** నాలుగో దశలో నాటు సారా తయారీ, అమ్మకాలను పూర్తిగా మానేసిన గ్రామాలు, పట్టణ ప్రాంతాలను 'సారా రహిత గ్రామలు'గా డిక్లరేషన్ ఇవ్వడం.

మిగతా 6వ పేజీలో



యజ్ఞోపవీత ధారణ

స్వర్ణకిరీటం

# కళ్యాణం.. వైభోగం

**రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ**
**వరమాలకై వేచె సమయాన..**
**శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె**
**మోగింది కల్యాణ శుభవేళ..**
**కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...**

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.



కళాకారుల నృత్యం



పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు





ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం



ఎదుర్కోలు దృశ్యం





సీతారాముల కళ్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు

# ఒక్క క్షణం ఆలోచించు..!

- మార్కులే కొలమానం కాదు..
- మరణం సమస్యకు పరిష్కారం కాదు
- పరీక్ష తప్పినా మెరుగైన అవకాశాలు
- క్షణికావేశంలో ఏ నిర్ణయం తీసుకోవద్దు
- నేడు ఇంటర్ ఫలితాలు విడుదల



**పరీక్ష ఫెయిల్ అయ్యామనో, మార్కులు తక్కువగా వచ్చాయనో.. అనుకున్న ర్యాంకు రాలేదనో.. తనువు చాలించడం న్యాయమా..? క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు వల్ల కన్నవాళ్లకు కడుపుకోత మిగల్చడం ధర్మమా..? కష్టకాలాన్ని, ప్రతికూల పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలే తప్ప అఘాయిత్యాలకు పాల్పడటం ఎంత వరకు సబబు? బలవన్మరణం ఉత్తముల లక్షణం కాదు. నిలబడి పోరాడితేనే జీవితం ఉజ్వలంగా ఉంటుంది. ఒకసారి పరీక్ష తప్పితే నష్టమేమి లేదు.. మళ్లీ రాద్దాం..! ఉత్తమ ఫలితాలు సాధించి లక్ష్యం దిశగా అడుగులు వేద్దాం.. ఒక్కక్షణం ఆలోచించు..! ఈ జీవితం మీది.. పరీక్ష మళ్లీ రాయవచ్చు.. ఈ మార్కుల వల్ల జీవితమే మారిపోదు. పదో తరగతిలో ఫెయిల్ అయిన ఓ అమ్మాయి.. మళ్లీ పరీక్ష రాసి ఉత్తీర్ణురాలై.. ఆ తరువాత బంగారు పతకాలు సాధించింది. ఇలాంటి వారెందరో ఉన్నారు. ఓర్పుతో ఆలోచిస్తే పరిష్కారం మీ చేతుల్లో ఉంది.**


**కర్నూలు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** ఏపీ ఇంటర్మీడియట్ బోర్డు శనివారం ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు విడుదల చేయనుంది. ఈమేరకు సన్నాహాలు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఫలితాల కోసం 45,325 మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. మార్చి ఒకటో తేదీ నుంచి 18వ తేది వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెట్, ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఫస్ట్ ఇయర్) విద్యార్థులు 22,207 మంది, రెండవ సంవత్సరం (సెకండ్ ఇయర్) విద్యార్థులు 23,098 మంది పరీక్షలు రాశారు. మరికొన్ని గంటల్లో రానున్న ఫలితాల కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. కన్నవాళ్లు సైతం తమ పిల్లల ఉత్తీర్ణత తెలుసుకోవాలని నిరీక్షిస్తున్నారు. తమ పిల్లలు ఉత్తీర్ణత ఫలితాలు తెలుసుకోవడం మంచిదే. ఏ కారణం చేతనో అనుకున్న ఫలితాలు రానప్పుడు తమ పిల్లలు ధైర్యం చెప్పాల్సి బాధ్యత కన్నవాళ్లపై ఉంది.

### తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి



పరీక్షా ఫలితాలు సమయంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకం. తోటి విద్యార్థుల కంటే తక్కువ మార్కులు వచ్చినా, అనుకున్న మార్కులు సాధించలేకపోయినా కొందరు విద్యార్థులు డిప్రెషన్‌కు లోనవుతుంటారు. అలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిరాశ, ఆందోళన, దుఃఖం వంటి భావోద్వేగాలకు పిల్లలు లోనుకాకుండా చూసుకోవాలి. వారి ప్రవర్తనలో ఎదైనా మార్పులు గమనిస్తే వారికి ధైర్యం కల్పించడంతో పాటు భవిషత్తులో విజయాలెన్నో అందుకునే శక్తి నీకుందంటూ ప్రొత్సాహం అందించాలి. వారికి అన్ని రకాలుగా సహాయంగా నిలబడాలి. విద్యార్థులు కూడా మానసిక ఆందోళనకు గురికాకూడదు. భయం వేసినా, బాదేసినా అమ్మనాన్నలతో పంచుకోవాలి. మరీ ఇబ్బందిగా ఉన్నప్పుడు వైద్యనిపుణులను సంప్రదించడం ఉత్తమం.

– డాక్టర్ ఎం.శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు



అదే క్రమంలో విద్యార్థులు కూడా ఉండిపోకూడదు.

### తల్లిదండ్రుల బాధ్యత

- విద్యార్థులు పరీక్షల్లో విఫలమైతే వారికి మద్దతుగా నిలవడం తల్లిదండ్రుల బాధ్యత. పిల్లలు ఒత్తిడికి గురికాకుండా అండగా నిలబడాలి. భవిషత్తులో ఎన్నో విజయాలు సాధించవచ్చని ప్రోత్సాహించాలి.
- ఫలానా విద్యార్థి మంచి ర్యాంకుతో ఉత్తీర్ణత సాధించాడనో.. పక్కింటి పిల్లలు మంచి మార్కులు తెచ్చుకున్నారనో.. తమ పిల్లలను తక్కువ వేసి వేరేవాళ్ల పిల్లలను గొప్పగా చూపడం చేయకూడదు.
- పరీక్షా ఫలితాలు వచ్చిన తర్వాత పిల్లలతో మాట్లాడాలి. ఆహ్లాదకర ప్రదేశాలకు తీసుకెళ్లి వారిలోని ఒత్తిడిని తగ్గించాలి.
- పిల్లలకు ఆరోగ్యకరమైన, ప్రశాంత వాతావరణ కల్పించాలి. ఒత్తిడి గురైనట్లు గుర్తిస్తే.. వారికి ధైర్యం ఇవ్వాలి. వాళ్లతోనే ఎక్కువ సమయం గడపాలి.
- పిల్లల తప్పులు ఎత్తిచూపి శిక్షించకుండా వారికి ప్రోత్సాహం అందించాలి. స్నేహితుల్లా చేయుత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
- తమ పిల్లలు ఉత్తమ ఫలితం సాధించాలని ఆశించడం సహజం. వారి ప్రయత్నాలను కూడా అభినందించాలి.
- విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాలను నిర్ణయించడంతో గురువులుగా, తల్లిదండ్రులుగా సహాయపడాలి.
- కన్నవాళ్లు తమ పిల్లల పట్ల చురుకైన పాత్ర పోషించడం ద్వారా వారు విజయం వైపు పరుగులు పెట్టేందుకు సహాయపడవచ్చు.
- పరీక్షా తప్పినా.. మార్కులు తక్కువగా వచ్చినా భయపడాల్సిన అవసరం లేదు. ఆ సమయంలో మీలో వచ్చే ఆలోచనలు అమ్మనాన్నలు, మిత్రులు, శ్రేయోభిలాషులతో పంచుకోండి.
- ఇప్పుడు పరీక్షా తప్పితే కొన్ని రోజుల్లోనే సప్లిమెంటరీ పరీక్షలు ఉన్నాయి.. మార్కులు తక్కువ వస్తే ఇంప్రూవ్‌మెంట్ రాసుకోవడానికి అవకాశం ఉంది. సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితం సాధించే అవకాశం ఉంది

## పత్తి ఓబులయ్య, ఎస్‌డీవీ అజీజ్‌లకు ఘనంగా సత్కారం



పత్తి ఓబులయ్యను సత్కరిస్తున్న ప్రజా వేదిక సంస్థ ప్రతినిధులు

**కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** ఇటీవల ఉగాది వేడుక రోజున రాష్ట్ర ప్రభుత్వం నుంచి కళారత్న (హంస) పురస్కారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకున్న టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, విద్వాన్ పత్తి ఓబులయ్యను, అదే రోజున సాహిత్యరంగంలో ఉగాది విశిష్ట పురస్కారం అందుకున్న కర్నూలుకు చెందిన చారిత్రక నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్‌లను శుక్రవారం రాత్రి ఘనంగా సత్కరించారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలోగల సాహితీ వేదికపై ప్రజా వేదిక సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా వేదిక కన్వీనర్ మురళీమోహన్ మాట్లాడుతూ ప్రజావేదిక ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణకు స్థాపించారని గుర్తు చేశారు. అందులో భాగంగా కళారంగానికి, సాహితీ రంగానికి సేవలు అందిస్తున్న పత్తి ఓబులయ్య, ఎస్‌డీవీ అజీజ్‌లకు రాష్ట్రస్థాయి పురస్కారాలు లభించడం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు వెంకటస్వామి, బడే సాహెబ్, మహమ్మద్ మియా, కె. బాలవెంకటేశ్వర్లు, వేదిక సభ్యులు, పలువురు కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



ఎస్‌డీవీ అజీజ్‌ను సత్కరిస్తున్న ప్రజా వేదిక సంస్థ ప్రతినిధులు

# మనసారా నవోదయం..!

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర విభజన తర్వాత నాటి టీడీపీ ప్రభుత్వం సారా నిర్మూలన కోసం నవోదయం అమలు చేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కూడా పరివర్తన కార్యక్రమం చేపట్టింది. జిల్లాలో 55 గ్రామాలను గుర్తించారు. 30 గ్రామాలను 'సారా రహిత గ్రామాలు'గా ప్రకటించారు. ఆయా గ్రామాల్లో 60 మంది నాటుసారా తయారీ, అమ్మకందారులకు రూ.54 లక్షలకు పైగా ఖర్చు చేసి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించారు.

### సారా రహిత కర్నూలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



సారా నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో 110 గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో సారా తయారీ, అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించాం. ఆయా గ్రామాల్లో 500 మంది తయారీ, అమ్మదారులు ఉన్నారని గుర్తించాం. వారిలో పరివర్తన తీసుకొచ్చేందుకు ఇప్పటికే జిల్లాలో అవగాహన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాం. మరో వైపు దాడులు కూడా చేస్తున్నాం. పోలీస్, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు, సిబ్బందితో ఎక్సైజ్ యంత్రాంగం సమన్వయం చేసుకొని నవోదయం 2.0 పక్కాగా అమలు చేసి సారా రహిత కర్నూలు జిల్లాను మార్చాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. సారా తయారీ, అమ్మకాలు సంపూర్ణంగా మానేసే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా సంపూర్ణ సహకారం అందించాలి.

– ఎం.సుధీర్‌బాబు, సూపరింటెండెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, కర్నూలు

### ఎక్సైజ్ సిబ్బంది దత్తత

కర్నూలు జిల్లాలో సాటుసారా తయారీ, అమ్మకాలు సాగిస్తున్న 110 గ్రామాలను సంబంధిత ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో పని చేసే సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లకు ఒక్కొక్కరికి ఒక్కో గ్రామం దత్తత ఇచ్చేలా ప్రణాళికలు తయారు చేశారు. అదే క్రమంలో ఇతర గ్రామాలను కూడా సిబ్బందికి దత్తత ఇస్తారు. ఆయా గ్రామాల్లో ఎక్సైజ్ నేరాలు జరిగితే అందుకు దత్తత ఇచ్చిన కానిస్టేబుల్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకుంటారు. దీనిని రికార్డులకు పరిమితం కాకుండా పక్కాగా అమలు చేస్తే నాటుసారా రహిత గ్రామాలుగా మార్చే అవకాశం ఉంది.

### టోల్ ఫ్రీ నంబరు 14405

ఏ గ్రామంలోనైనా నాటుసారా తయారీ, అమ్మకాలు చేస్తున్నా, అనుమతి లేని కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మద్యం విక్రయాలు సాగిస్తుంటే టోల్ ఫ్రీ నంబరు. 14405కు కాల్ చేస్తే ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందిస్తారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు, ఎక్కువ రేట్లకు మద్యం అమ్మకాలు చేసినా ఈ నంబరుకు కాల్ చేయవచ్చు.

**ఎక్సైజ్ స్టేషన్ల వారీగా నాటుసారా తయారీ, అమ్మకాలు చేస్తున్న గ్రామాల వివరాలు**

| నియోజకవర్గం | ఏ-కేటగిరీ | బీ-కేటగిరీ | సీ-కేటగిరీ | మొత్తం |
|---|---|---|---|---|
| కర్నూలు | 5 | 6 | 21 | 32 |
| కోడుమూరు | 2 | 2 | 14 | 18 |
| ఆదోని | 9 | -- | 1 | 10 |
| ఆలూరు | 4 | 2 | 1 | 7 |
| ఎమ్మిగనూరు | -- | 2 | -- | 2 |
| కోసిగి | -- | 4 | 2 | 6 |
| పత్తికొండ | 5 | 9 | 21 | 35 |
| మొత్తం | 25 | 25 | 60 | 110 |



ఆదోనిలో సారా నిర్మూలన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు

## నాటు సారా కనిపించకూడదు

- బెల్లం సరఫరాదారులపై కేసులు పెట్టండి
- ఉమ్మడి జిల్లా సీఐలు, ఎస్ఐలకు ఎక్సైజ్ డీసీ ఆదేశం



సీఐలతో సమీక్షిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

**కర్నూలు అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):** నాటు సారా ఒక్క చుక్క కూడా కనిపించకూడదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి. శ్రీదేవి ఆదేశించారు. శుక్రవారం నగరంలోని జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చాంబర్లో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల ఎక్సైజ్ సీఐలతో అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావుతో కలిసి డిప్యూటీ కమిషనర్ సమీక్షించారు. నవోదయం-02 కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అందుకు తగ్గట్టుగా అందరూ బాధ్యతతో పని చేయాలని సూచించారు. నాటు సారా తయారీదారులు, అమ్మకం దారులతో పాటు బెల్లం సరఫరాదారులపై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. వారిపై బైండోవర్ కేసులు పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో ఉమ్మడి జిల్లాల సూపరింటెండెంట్లు ఎం సుధీర్ బాబు, రవికుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు రామకృష్ణారెడ్డి, రాజశేఖరగౌడ్, వి. రాముడు, సీఐలు పాల్గొన్నారు.

## ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించాలి

**క్రీడాకారిణి జఫ్రిన్‌ను అభినందించిన జేసీ డాక్టర్ బి. నవ్య**



షేక్ జఫ్రిన్‌ను అభినందిస్తున్న జేసీ డాక్టర్ బి. నవ్య

**కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** నవంబర్ 2025లో జరిగే ఒలింపిక్స్ క్రీడల్లో క్రీడాకారిణి షేక్ జఫ్రిన్ గోల్డ్ మెడల్ సాధించి, రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య ఆకాంక్షించారు. గత నెల 20 నుంచి 23 వరకు న్యూఢిల్లీలోని ఆలిండియా స్పోర్ట్స్ కౌన్సిల్ ఆఫ్ డెఫ్ ఆధ్వర్యంలో గుజరాత్ రాష్ట్రంలోని అహమ్మదాబాద్‌లో జరిగిన నేషనల్ గేమ్స్ (నేషనల్ డెఫ్ సీనియర్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ 2025) పోటీల్లో సింగిల్స్ అండ్ మిక్స్ డబుల్స్ విభాగాల్లో కర్నూలు డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న షేక్ జఫ్రీన్ 2 గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం కర్నూలులోని డీసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథిగా జేసీ బి. నవ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి, డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి షేక్ జఫ్రీన్‌ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు

## పెన్షనర్ల కోసం 'హెల్ప్‌లైన్'

**కర్నూలు లీగల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రెండు హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేశారు. ఈమేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సబ్ ట్రెజరీలలో పెన్షన్ల చెల్లింపులో జాప్యం, అవినీతి మూలంగా పెన్షనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గతంలో పత్రికల్లో వార్తా కథనాలు వచ్చాయి. దీనిపై రాష్ట్ర లోకాయుక్త సుమోటోగా స్పందించి, ఈ ఆరోపణలపై విచారించేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. అయితే ట్రెజరీ అధికారుల జాప్యం, అవినీతి ఆరోపణలకు తగిన సాక్షాధారాలు ఏమీ లేవని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కొన్ని చర్యలు తీసుకుంటున్నట్లు విచారణ కమిటీ లోకాయుక్తకు తెలియజేసింది. పెన్షనర్ల సహాయార్థం హెల్ప్ నెంబర్లు 63009 68380, 98493 88295లకు తమ సమస్యలను తెలియజేయాలని, ఒక కోఆర్డినేటన్ కమిటీని ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు విచారణ కమిటీ లోకాయుక్తకు తెలియజేసింది. దీంతో లోకాయుక్త ఈ కేసును మూసివేస్తున్నట్లు లోకాయుక్త రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## మల్లన్న సేవలో ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్

**శ్రీశైలం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డికి వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. తరువాత ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి శ్రీశైలంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.



మలన్నను దర్శించుకున్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి

# రోడ్డు ప్రమాదంలో యువకుల దుర్మరణం

- పులకుర్తి సమీపంలో ఢీకొన్న ఆటో, బైకు
- మృతులు గోనెగండ్ల మండలం అల్వాల వాసులు



మృతిచెందిన హర్ష, జయరాజు(ఫైల్)

**కోడుమూరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పులకుర్తి గ్రామ శివారులో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. గోనెగండ్ల మండలంలోని అల్వాల గ్రామానికి చెందిన బోయ హర్ష (20), ఎం.జయరాజు (24) బైక్‌పై గూడూరుకు పని నిమిత్తం వెళ్లారు. అక్కడ పని ముగించుకుని మధ్యాహ్నం తిరుగు పయనమయ్యారు. అయితే పులకుర్తి సమీపంలో చిన్న కాలువ దగ్గర కాకరకాయల సంచులతో గూడూరుకు వెళ్తున్న ఆటో, బైకు ఢీకొన్నాయి. దీంతో బైక్ ఉన్న ఇద్దరూ రోడ్డు పక్కన పొదల్లోకి ఎగిరి పడ్డారు. హర్ష అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన జయరాజును 108లో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంతో మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. పోలీసులు హర్ష మృతదేహాన్ని కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జయరాజు మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. జయరాజుకు భార్య సజీవ, ఐదునెలలు, రెండేళ్ల వయసున్న కుమారులు ఉన్నారు. జయరాజు డ్రైవర్‌గా పని చేసేవాడు. జయరాజు మృతితో ఇంటి పెద్దదిక్కు కోల్పోయింది.

**వలస వెళ్లి స్వగ్రామానికి వచ్చిన హర్ష**

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి హృదయవిదారకరంగా మారింది. అల్వాలకు చెందిన బోయ శంకరమ్మ, నాగన్న దంపతులకు కొడుకు హర్ష, కూతురు సంతానం. కూలీ పనులతో జీవనం గడుపుతోంది. కొన్ని రోజుల క్రితం కుటుంబమంతా గుంటూరుకు వలస వెళ్లారు. అయితే రెండు రోజుల క్రితం హర్ష ఒక్కడే గ్రామానికి చేరుకున్నాడు. వలస నుంచి తల్లిదండ్రులు శుక్రవారం మధ్యాహ్నం గ్రామానికి చేరుకున్నారు. వచ్చిన కొద్ది సేపటికే కొడుకు ప్రమాదానికి గురయ్యాడని తెలిసి తల్లడిల్లిపోయారు.

## ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి మృతి

- వాహనం కింద సేదతీరుతున్న కూలీ
- గమనించకుండా డ్రైవర్ రివర్స్ చేయడంతో ప్రమాదం

**మిడుతూరు, ఏప్రిల్ 11( ఆంధ్రజ్యోతి):** మండలంలోని నాగలూటి గ్రామంలో నాపరాతి గనుల వద్ద టాక్టర్ రివర్సు చేస్తుండగా వెనకాల కూర్చున్న అల్లబకాస్(55)పై ఎక్కడంతో మృతి చెందాడు. వివరాలివీ.. అల్లబకాష్ శుక్రవారం మధ్యాహ్నం నాగలూటి గ్రామంలోని నాపరాతి గనిలో రోజువారిగా కూలీ పనులకు వెళ్లాడు. అక్కడ పని చేసి దాహం తీర్చుకుని నాపరాళ్లకోసం వచ్చి ఆగి ఉన్న ట్రాక్టర్ కింద కూర్చున్నాడు. అల్లబకాష్‌ను గమనించకుండా డ్రైవర్ ట్రాక్టర్‌ను రివర్సు చేయడంతో అల్లబాకాస్ మీద ఎక్కింది. చుట్టు పక్కల వాళ్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కర్నూలుకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అల్లబకాష్ మృతి పట్ల అతని భార్య మాసుంబి మిడుతూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# పొగాకు రైతులు దగా

- సాగుకు ముందే కొంటామన్న కంపెనీలు
- దిగుబడి వచ్చాక కొనుగోలుకు అడ్డగోలు నిబంధనలు
- పెరిగిన సాగు విస్తీర్ణం - ఆశాజనకంగా దిగుబడి
- రూ.15వేల నుంచి రూ.5వేలకు పడిపోయిన ధరలు



కోవెలకుంట్ల కొనుగోలు కేంద్రానికి వచ్చిన పొగాకు బేళ్లు.. తూకం వేస్తున్న సిబ్బంది

**కొలిమిగుండ్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) :** ఉమ్మడి జిల్లాలో పొగాకు రైతులను కంపెనీలు దగా చేశాయి. సాగుకు ముందు పొగాకు కొనుగోలుకు హామీ ఇచ్చి, విత్తనాలు అందించి మరీ అన్నదాతలను ప్రోత్సహించిన కంపెనీలు, దిగుబడి వచ్చాకు కొనుగోలు చేయడానికి అడ్డగోలు నిబంధనలు పెడుతున్నాయి. దీంతో అన్నదాతలు లబో దిబోమంటున్నారు. గతేడాది పొగాకు సాగు అన్నదాతలకు లాభాలు కురిపించడంతో ఈ ఏడాది మరింత ఆశతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా పొగాకు సాగు చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఉమ్మడి జిల్లాలో మూడింతలకు పైగా అధికంగా పొగాకు సాగైంది. మరోవైపు దిగుబడి కూడా గతేడాదికన్నా అధికంగా వచ్చినట్లు అన్నదాతలు పేర్కొంటున్నారు. గత సంవత్సరం కర్నూలు జిల్లాలో రైతులు పొగాకు 9586 ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది 36,471 ఎకరాల్లో సాగుచేశారు. నంద్యాల జిల్లాలో గతేడాది 8791 ఎకరాల్లో సాగుచేయగా, ఈఏడాది 30,865 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. మొత్తం ఉమ్మడి జిల్లాలో 67,336 ఎకరాల్లో రైతులు పొగాకు చేసినట్లు వ్యవసాయ శాఖ లెక్కల ద్వారా తెలుస్తోంది. కాగా గత సంవత్సరం పొగాకుకు విపరీతమైన డిమాండ్ ఏర్పడటంతో కంపెనీలు రైతుల వద్దకు వచ్చి క్వింటాలు రూ.15వేల నుంచి 16,500ల వరకు కొనుగోలు చేశారు. దీంతో అన్నదాతలు మూడింతలు అధికంగా పొగాకు సాగు చేశారు. అయితే ఈ ఏడాది పొగాకు కొనుగోళ్లకు కంపెనీలు కొర్రీలు పెడుతున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. రైతులు కంపెనీల వద్దకే పొగాకు తీసుకవెళ్లి అమ్ముకుంటున్నారు. దీంతో వారు ఇష్టానుసారంగా ధరలు చెల్లిస్తూ రైతులను దోచుకుంటున్నారు. క్వింటాలుకు రూ.5000, నుంచి రూ.6500 మించి ధర పలకడంలేదని రైతులు వాపోతున్నారు.

జిల్లాలోని కోవెలకుంట్ల, బనగానపల్లె, నందికొట్కూరు, నంద్యాల తదితర ప్రాంతాల్లో కంపెనీలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాయి. దీంతో రవాణా ఖర్చులను భరించి, అంత దూరం తీసుకెళ్లాక నాణ్యత లేదని, తడిసిపోయిందని కంపెనీలు ధరల్లో కోత కోస్తున్నాయి. కొంతమంది రైతుల పొగాకు కొనకుండా వెనక్కి పంపుతున్నాయి. ప్రభుత్వం జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని పొగాకు రైతులు కోరుతున్నారు.

# జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

- నంద్యాల కలెక్టర్ రాజకుమారి


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం డిస్ట్రిక్ ఇండస్ట్రియల్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు కల్పించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పెట్టుబడి రాయితీ, పావలావడ్డీ, విద్యుత్, సేల్ ట్యాక్స్ తదితర రాయితీల కింద జిల్లాలో ఉత్పాదన, సేవా రంగాల్లోని 24 యూనిట్లకు 1.67కోట్ల విలువైన రాయితీ ప్రయోజనాలు మంజూరు చేశామని చెప్పారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి గత త్రైమాసికంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులకోసం పది దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సింగల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 8పరిశ్రమలకు అనుమతులు మంజూరయ్యాయని, మిగిలిన రెండు దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెఇలపారు. వాటిని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం జవహర్‌బాబు, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, ఎల్‌డీఎం రవీంద్రకుమార్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన డ్రైనేజీ వివాదం

**ఓర్వకల్లు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని నన్నూరు గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన డ్రైనేజీ వివాదం ఓ వ్యక్తి మరణానికి దారితీసింది. వివరాలివీ.. బస్టాండు వద్ద ఉన్న సచివాలయం సమీపంలో నివాసముంటున్న అల్లనగరి నాగరాజు, బత్తి వెంకటరాముడు కుటుంబాల మధ్య ఇళ్ల ముందు ఉన్న డ్రైనేజీ కాలువ విషయంలో కొంత కాలంగా వివాదం ఉంది. శుక్రవారం వీరిద్దరి మధ్య ఇదే సమస్యపై వాదోపవాదాలు జరిగాయి. ఈ క్రమంలో అల్లనగరి నాగరాజు(50) అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగరాజుకు భార్య లలిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# పెద్దాసుపత్రి వద్ద ట్రాఫిక్ ప్రక్షాళన

- వ్యాపారులతో అధికారుల చర్చలు



వ్యాపారులతో మాట్లాడుతున్న సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్

**కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఎదురుగా ఉన్న దుకాణాలను తొలగించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన నగర పాలక అధికారుల సమావేశంలో మంత్రి టీజీ భరత్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా దుకాణాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు నగర పాలక సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ అధ్వర్యంలో శుక్రవారం సంబంధిత వ్యాపారులతో చర్చలు జరిపారు. ఫుట్‌పాత్‌పై దుకాణాలు ఉండరాదని హెచ్చరించారు. వీటి వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్నదని, తక్షణమే మంత్రి ఆదేశాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. అయితే ఒక్కరోజు గడువు ఇస్తే దుకాణాలను తొలగిస్తామని వ్యాపారులు అధికారులకు విన్నవించారు.

## మొక్కజొన్న దగ్ధం

- రైతులకు రూ.10 లక్షలు నష్టం


మంటలను అదుపులోకి తెస్తున్న ఫైర్ సిబ్బంది

**ప్యాపిలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని జలదుర్గం గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో 8ఎకరాల్లో మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతైంది. దాదాపు రూ.10లక్షల నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన రైతులు బాలరంగయ్య, శివకుమార్, రాజశేఖర్, రాధాక్రిష్ణ, చంద్రుడు పొలాలు పక్కపక్కనే ఉన్నా యి. ఒక్కో రైతు రెండు నుంచి మూడు ఎకరాల వరకు మొ క్కజొన్న సాగు చేశారు. పం ట కూడా కోత దశకు వచ్చిం ది. ప్రమాదవశాత్తు పంటకు నిప్పు అంటుకుంది. డోన్ ఫైరింజన్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. 8 ఎకరాల్లో పంట అగ్నికి ఆహుతైంది. ఒక్కో రైతుకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లింది. అప్పులు చేసి పంటను సాగు చేశామని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## ఇద్దరికి తీవ్ర గాయాలు

**ఓర్వకల్లు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40 పై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలివీ.. గడివేముల మండలం బిలకలగూడూరు గ్రామానికి చెందిన పోతురాజు మధు, పోతురాజు శ్రీనివాసులు నన్నూరులో వివాహం ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. స్థానిక బైరెడ్డి కాలనీ సమీపంలో బైకు ముందు వెళుతున్న కారును ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను టోల్‌ప్లాజా అంబులెన్సులో కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## 'ఫెయిల్' భయం.. ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న సుదీశ్వర రెడ్డి

**బండిఆత్మకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అవుతానని భావించి భయపడిన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన బండిఆత్మకూరు మండలంలోని ఏ.కోడూరులో శుక్రవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏ.కోడూరు గ్రామానికి చెందిన వెంకట సుబ్బారెడ్డి కుమారుడు వెంకట సుదీశ్వరరెడ్డి (16) నంద్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవలే పరీక్షలు పూర్తి చేసుకున్న సుదీశ్వర రెడ్డి కొంతకాలంగా ముభావంగా ఉండేవాడు. ఈ క్రమంలో శనివారం ఫలితాలు విడుదల అవుతాయని తెలుసుకున్న యువకుడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫెయిల్ అయితే ఇంటా, బయటా అవమాన పాలవుతానని భావించిన సుదీశ్వర రెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## అప్పులు అధికమై బలవన్మరణం

**దేవనకొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** అనారోగ్యం, అప్పు ల భారంతో జీవితం పై విరక్తి చెంది దేవనకొండకు చెందిన తలారి లక్ష్మన్న (41) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. లక్ష్మన్న రెండు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గొర్రెపిల్లల కొనడానికి చేసిన అప్పులు రూ. 5 లక్షలకు చేరాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉదయం భైరవానికుంట ఆంజనేయస్వామి ఇనాం భూమిలో చెట్టుకు ఉరేసుకున్నారు. లక్ష్మన్న భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు.

## చికిత్స పొందుతూ రైతు మృతి

**గోనెగండ్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఐరన్ బండ గ్రామా నికి చెందిన గొల్ల రామాంజనేయులు (42) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. రామాంజనేయులుకు భార్య వీరేషమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. 1.65 ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. అన్న వెంకటేశ్వర్లకు ఉన్న నాలుగు ఎకరం పొలాన్ని కూడా కౌలుకు తీసుకొని గత 8 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. మూడేళ్ల నుంచి పత్తి, మిరప, ఉల్లి, వేరుశనగ పంటలు సాగు చేశారు. దీనికి తోడు ఈ ఏడాది తనపొలంలో మిరప, ఉల్లి, వేరుశనగ పంటలు సాగు చేశాడు. మిరపకు వైరస్ సోకడంతో పంట పూర్తిగా దెబ్బతింది. ఉల్లి, వేరుశనగ పంటలు సరిగా పండలేదు. గత మూడేళ్లుగా చేసిన అప్పు వడ్డీతో కలిపి సుమారు రూ. 10 లక్షలకు చేరింది. అప్పు ఎలా తీర్చాలోనన్న మనస్తాపంతో ఈనెల 10న ఇంట్లో ఎవరూ లేని సమయంలో రామాంజనేయులు పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన కర్నూలు ప్రభుత్వ ఆసుప త్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్ర వారం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.









**బహిరంగ ప్రకటన**

**ICICI Bank** నమోదిత కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, పాత పద్రా రోడ్, వడోదర - 390007
కార్పొరేట్ కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400051.

**బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన**

బంగారు ఆభరణాల సౌకర్యం నిమిత్తం ICICI బ్యాంక్ లిమిటెడ్ (ICICI బ్యాంక్) నుండి పొందిన (సౌకర్యం) తమ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు నోటీసు జారీచేయడమైనది. వారు బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను ఏప్రిల్ 23, 2025న ఇ-వేలం వేయడానికి మాకు తప్పనిసరి అయ్యింది. ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే ఖాతాను తొలగించడానికి/ ఇ-వేలం తేదీని మార్పు చేయడానికి ICICI బ్యాంక్‌కు అధికారం ఉంది. వేలం - https://gold.samil.in ఆన్‌లైన్‌లో మ.12:30 గం. నుండి మ.3:30 గం. మధ్య నిర్వహించబడుతుంది. సవివరమైన నియమ నిబంధనల కోసం ఇవ్వబడిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవండి. మరణించిన రుణగ్రహీత విషయంలో, వారి న్యాయవారసులకు అన్ని నియమ నిబంధనలు వర్తిస్తాయి.

| రుణ ఖాతా నం. | ఖాతాదారు పేరు |
|---|---|
| శాఖ పేరు: ఆమదాలవలస | |
| 735962000567 | పోతల గీతా కుమారి |
| శాఖ పేరు: అనంతపురం- బళ్ళారి రోడ్ | |
| 460462000194 | అచ్చుకట్ల మహమ్మద ముక్తియార్ |
| శాఖ పేరు: అనంతపురం- రామ్‌నగర్ | |
| 355162003683 | జనగాని వెంకటరాముడు |
| శాఖ పేరు: అనపర్తి | |
| 067762017325 | దుర్గాప్రసాద్ రెడ్డి పాదాల |
| శాఖ పేరు: బెండపూడి | |
| 307162001531 | [illegible] |
| శాఖ పేరు: భూపాల్ నగర్ | |
| 306762000340 | వడ్డే జయకృష్ణ |
| శాఖ పేరు: బొబ్బిలి | |
| 395662002725 | [illegible] |
| శాఖ పేరు: కడప | |
| 067462011873 | [illegible] నారాయణ |
| శాఖ పేరు: డోన్ | |
| 794962000290 | బోయ తూనే రామ్ గోపాల్ |
| శాఖ పేరు: గూడూరు | |
| 069262012176 | [illegible] |
| శాఖ పేరు: గుంటూరు- పట్టాభిపురం | |
| 722262000699 | రాజ్‌కుమార్ యడవల్లి |
| శాఖ పేరు: జగ్గయ్యపేట | |
| 179762004775 | ప్రత్తిపాటి శివబాబు |
| 179762006407 | [illegible] |
| 179762006409 | [illegible] |
| 179762006408 | [illegible] |
| శాఖ పేరు: జూలకల్లు | |
| 307462001241 | నల్లగొర్ల రాములమ్మ |
| శాఖ పేరు: కదిరి | |
| 395462004187 | [illegible] |
| 395462003791 | నంగి నారాయణరెడ్డి |
| 395462004331 | [illegible] |
| శాఖ పేరు: కాకినాడ- సర్పవరం | |
| 247762001771 | [illegible] కుమార్ |
| శాఖ పేరు: కంభంపాడు | |
| 307662000635 | అనిల్ కుమార్ సోమరాజు |
| శాఖ పేరు: కందుకూరు | |
| 069762019227 | ఆత్మకూరి నరేంద్ర |
| 069762021124 | [illegible] |
| 069762019803 | [illegible] |
| 069762022764 | గద్దె సుభాషిణి |
| శాఖ పేరు: కనిగిరి | |
| 069862017149 | చెంబేటి ప్రతాప్ |
| శాఖ పేరు: కర్నూలు | |
| 027962019835 | బి మధుసూదన్ నాయుడు |
| శాఖ పేరు: మాచర్ల- ఆంధ్రప్రదేశ్ | |

| రుణ ఖాతా నం. | ఖాతాదారు పేరు |
|---|---|
| 377062004219 | కంభంపాటి సత్యనారాయణ |
| శాఖ పేరు: నాయుడుపేట | |
| 069462012205 | పులుగుల్ల వెంగయ్య |
| శాఖ పేరు: నందలూరు | |
| 177562000810 | [illegible] |
| శాఖ పేరు: నంద్యాల | |
| 068862011561 | గడిగేపల్ల శివరామయ్య |
| శాఖ పేరు: నరసన్నపేట | |
| 751962000974 | సుగ్గు సుధాకర్ రెడ్డి |
| 751962000969 | జమ్మన హేమకుమారి |
| శాఖ పేరు: పలాస | |
| 069962011316 | గుమ్మడి విజయ శ్రీ |
| 069962011656 | తమడ భాస్కరరావు |
| శాఖ పేరు: పిఠాపురం | |
| 400862003469 | అంబటి మంగి రెడ్డి |
| శాఖ పేరు: పోరంకి | |
| 236862002116 | [illegible] |
| శాఖ పేరు: పుల్లంపేట | |
| 204662000657 | నల్లం నాగేశ్వరి |
| శాఖ పేరు: రాజమండ్రి-దన్వాయిపేట | |
| 118562004904 | బొక్క చిన్న వెంకటరమణ |
| శాఖ పేరు: రామచంద్రాపురం | |
| 048362016139 | మేడపాటి సత్య నారాయణ రెడ్డి |
| శాఖ పేరు: రమణక్కపేట | |
| 406562001585 | కొప్పిశెట్టి తాతారావు |
| శాఖ పేరు: రణస్థలం | |
| 744062001081 | ముంగం చిన్నారావు |
| శాఖ పేరు: రాయచోటి | |
| 395762004282 | నల్లమల శ్రీలక్ష్మి |
| శాఖ పేరు: రేపల్లె | |
| 400162003852 | దొప్పర మహిమ రాజు |
| 400162004291 | దొప్పర మహిమ రాజు |
| 400162004299 | [illegible] |
| శాఖ పేరు: శ్రీకాళహస్తి | |
| 375862003587 | వి సుజిత్ కుమార్ రెడ్డి |
| శాఖ పేరు: తెనాలి | |
| 253162006786 | సుదేపల్లి శ్రీనివాసరావు |
| శాఖ పేరు: తిరుపతి | |
| 630962040336 | నలంజ అశోక్ కుమార్ |
| శాఖ పేరు: తిరువూరు | |
| 395962002101 | దిరిసెపు సత్య నారాయణ రెడ్డి |
| శాఖ పేరు: తుని | |
| 197962013188 | మళ్లిడి దుర్గా భవాని |

| రుణ ఖాతా నం. | ఖాతాదారు పేరు |
|---|---|
| శాఖ పేరు: విజయవాడ- ఏలూరు రోడ్ | |
| 180362002505 | రమేష్ కుమార్ ప్రజాపత్ |
| 180362002583 | ఎం సోమశేఖర్ రావు |
| శాఖ పేరు: విజయవాడ- సత్యనారాయణపురం | |
| 745362000689 | భూలక్ష్మి గద్దం |
| శాఖ పేరు: వినుకొండ | |
| 395062001454 | భూక్య విష్ణు నాయక్ |
| శాఖ పేరు: విశాఖపట్నం- అచ్యుతాపురం | |
| 421062001039 | [illegible] రవి కుమార్ |
| శాఖ పేరు: విశాఖపట్నం- సుజాతనగర్ | |
| 428262000988 | [illegible] రాజేష్ |
| శాఖ పేరు: వొమ్మంగి | |
| 307262002492 | పట్నాల రాజ మణికంఠ |
| శాఖ పేరు: వుయ్యూరు - ఆంధ్రప్రదేశ్ | |
| 375962000815 | షేక్ ఇబ్రహీం |
| శాఖ పేరు: యర్రగుంట్ల | |
| 131062001350 | గోపి సెట్టి చిన్న నాంచారయ్య |
| 131062006776 | దాసరి బాల నాగన్న |
| శాఖ పేరు: డోంబివాలి-శిల్ ఫాట | |
| 340462002114 | శ్రీకాంత్ బాబు వామనగుంట |
| శాఖ పేరు: హైదరాబాద్- బహదూర్ పురా | |
| 736262000555 | మహ్మద్ అబ్దుల్ రషీద్ సిద్దిఖీ |
| శాఖ పేరు: హైదరాబాద్-కూకట్‌పల్లి | |
| 631262037377 | [illegible] |
| శాఖ పేరు: హైదరాబాద్-మాతృశ్రీ నగర్ కాలనీ | |
| 468262000151 | సాయిరెడ్డి చిట్టెపు |
| శాఖ పేరు: జనగాం | |
| 070362016622 | [illegible] |
| 070362017515 | వేముళ్ల సత్యనారాయణ రెడ్డి |
| శాఖ పేరు: [illegible] | |
| 260562000764 | [illegible] |
| శాఖ పేరు: నందిగ్రామ్ | |
| 223262002679 | [illegible] రాములు |
| శాఖ పేరు: నరసంపేట | |
| 092162033300 | నారెడ్ల రవీందర్ |
| శాఖ పేరు: నవషేవా-Jnpt | |
| 147962001401 | పొన్నగంటి వీర వెంకట సురేంద్ర |
| శాఖ పేరు: పరాన్‌కోట్- డబ్ల్యుసీ రోడ్ | |
| 393062000254 | మూడడ్ల శివ కుమార్ |
| శాఖ పేరు: సిరిసిల్ల, తెలంగాణ | |
| 363262006498 | వీరబోయిన శ్రీనివాస్ |

తేది: 12.04.2025
ప్రదేశము: అనంతపురం, అన్నమయ్య, బాపట్ల, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, గుంటూరు, కాకినాడ, కృష్ణా, కర్నూలు, నంద్యాల, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీ సత్యసాయి, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, వై.యస్.ఆర్ కడప, కరీంనగర్, మేడార్, నరసంపేట, ప్రకాశం, వరంగల్, పశ్చిమ గోదావరి, హైదరాబాద్

సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరపున

# నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

# ఘనంగా జ్యోతిబా పూలే జయంతి





నందికొట్కూరులో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, చిన్నవెంకటస్వామి తదితరులు



నంద్యాలలో నివాళి అర్పిస్తున్న కలెక్టర్, ప్రజా సంఘాల నాయకులు

**నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా నంద్యాలలోని పద్మావతినగర్ సెంటర్‌లో ఉన్న జ్యోతిబాపూలే విగ్రహానికి కలెక్టర్ రాజకుమారితో పాటు ఎస్సీ, బీసీ, ఇతర ప్రజాసంఘాల నాయకులు పూలమాలలువేసి నివాళి అర్పించారు. దళితులు, మహిళలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కషి చేసిన మహాత్మా జ్యోతిబా పూలే గొప్ప సంఘ సంస్కర్త అని కలెక్టర్ కొనియాడారు.

**నందికొట్కూరు:** నాటి సమాజంలో అనగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహానేత మహాత్మా జ్యోతిబా పూలే అని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శుక్రవారం జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా పట్టణంలోని ఆత్మకూరు రోడ్డులో ఉన్న పూలే విగ్రహానికి జయసూర్య, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన, మహిళోద్ధారణకు విశేష కృషి చేసిన మహాత్ముడు జ్యోతిబా పూలే అని కొనియాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు భాస్కర్‌రెడ్డి, జాకీర్ హుస్సేన్, మహేశ్వరరెడ్డి, ముర్తుజావలి, వేణుగోపాల్, ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు.

● పట్టణంలోని ఆత్మకూరు రోడ్డులో ఉన్న జ్యోతిబా పూలే విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాకరవాడ చిన్న వెంకటస్వామి, కౌన్సిలర్ చాంద్‌బాషా, లాలు ప్రసాద్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

**పాములపాడు:** పాములపాడులో జ్యోతిబా పూలే జయంతిని నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ఎస్ఆర్ గోపాల్, సామాజిక వేత్త డాక్టర్ నాగన్న మండల అధ్యక్షుడు మురళీమోహన్, జాతీయ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు నల్లమల అబ్రహాం, నాగరాజు అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షులు నాగరాజు, దేవభక్తుడు పూలే విగ్రహానికి పూలమాలలు వేశారు. ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** ఆత్మకూరులోని సంగమేశ్వరం సర్కిల్‌లోని జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ నాగన్న, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు. అలాగే కేవీపీఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు ఏసురత్నం, సహాయ కార్యదర్శి భాస్కర్ జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

**బండిఆత్మకూరు:** బండి ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో జ్యోతిబా పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏవో శ్యామల, ఈవోపీఆర్డీ రామకృష్ణవేణి, ఏపీవో వసుధ, సీనియర్ అసిస్టెంట్ చంద్రమౌళి, ఫణీంద్ర, టీఏలు పాల్గొన్నారు.

**వెలుగోడు:** వెలుగోడులో జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం, బీసీ సంఘం నాయకులు రఘురాముడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





పాములపాడులో..



వెలుగోడులో..



ఆత్మకూరులో..



బండిఆత్మకూరులో..

## అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



కొబ్బరికాయలు తీసుకెళ్తున్న అర్చకులు, సిబ్బంది, భక్తులు

**శ్రీశైలం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):** శ్రీశైల మహాక్షేత్రంలో చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం గానీ, శుక్రవారం గానీ భ్రమరాంబ అమ్మవారికి కుంభోత్సవం జరిపించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఏప్రిల్ 15 న కుంభోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాధికాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు. ఈవో ఎం. శ్రీనివాసరావు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

● శ్రీశైలం మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయల సేవను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా గణపతి పూజ చేశారు. శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది.

## ఘనంగా కవి సమ్మేళనం



కవులు, రచయితలను సన్మానిస్తున్న నిర్వాహకులు

**నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లా ముస్లిం రచయితల సంఘం(మురసం) ఆధ్వర్యంలో నంద్యాల నడిగడ్డలోని రాయల్ పబ్లిక్ స్కూల్‌లో రమజాన్ కవి సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. ఈ కవి సమ్మేళనంలో తెలుగు, ఉర్దూ కవుల కవితలతో మతసామరస్యం వెల్లివిరిసింది. మురసం అధ్యక్షుడు ఎంఎండీ రఫీ అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ మాజీ చైర్మన్ నౌమాన్, ఆత్మీయ అతిథులుగా మురసం రాష్ట్ర ఉపాధ్య క్షుడు అబ్దుల్ సమద్, అభ్యుదయ రచయితల సంఘం అధ్య క్షుడు ముర్తుజా హాజరయ్యారు. అతిథులు మాట్లాడుతూ దేశంలో మత సామరస్యం కోసం సాహిత్యప్రియులు కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 18మంది తెలుగు, ఆరుగురు ఉర్దూ కవులు పాల్గొన్నారు. రచనలు సామాజిక రుగ్మతలకు దూరం చేయాలని, రాబోయే తరాలకు రచనా సాహిత్యం పెంచేలా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కవులు కొప్పుల ప్రసాద్, మహబుబ్ బాషా, మద్దిలేటి, రఫి, ముస్లిం ప్రదాన కార్యదర్శి మహబుబ్‌బాషా, తదితర కవులు, ఉపాధ్యాయులు పాల్గొని కవితలు వినిపించారు. అనంతరం కవులందరికి ముఖ్య అతిధుల చేతులమీదుగా శాలువా కప్పి, మెమెంటోతో సత్కరించారు.

## స్మార్ట్ మీటర్ల ఏర్పాటు సరికాదు: సీపీఎం



నంద్యాలలో పోస్టరును విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

**నంద్యాల రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):** ఇళ్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం సరికాదని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో 'మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు...విద్యుత్ చార్జీలు తగ్గించండి' అనే పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్తు బిల్లులు ఇప్పటికీ ఎక్కువగా వస్తున్నాయన్నారు. నాయకులు తోట మద్దులు, నరసింహులు, మహమ్మద్ గౌస్, వెంకటలింగం తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** స్మార్ట్ మీటర్లతో పాటు ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు రణధీర్ కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయం నందు మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు.. కరెంట్ చార్జీలు తగ్గించాలనే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు షేక్ ఇస్మాయిల్, వీరన్న, నాగేశ్వరరావు, జబీవుల్లా తదితరులు ఉన్నారు.

## ఉత్కంఠగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

**నంద్యాల టౌన్ ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల బార్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా సాగాయి. పోటీ ఎక్కువగా ఉండడంతో టెన్షన్ వాతావరణం కొనసాగింది. ఉదయం నుంచి ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం వరకు 418 ఓట్లల్లో 398 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం లెక్కించిన ఓట్లల్లో నూతన అధ్యక్షుడిగా హుసేన్‌బాషా 25 ఓట్లతో, జనరల్ సెక్రటరీగా ఏంఆర్ కృష్ణారెడ్డి 75 ఓట్లతో, జాయింట్ సెక్రటరీగా బాలు నాయక్ 207 ఓట్లతో, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీగా చిన్న లింగమయ్య 8 ఓట్ల తేడాతో విజయం సాధించారు. వీరికి పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యలను పరిష్కరించే విధంగా పని చేస్తామని తెలిపారు.

## ముస్లింల నిరసన

**పాములపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** పాములపాడులో ముస్లింలు వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మసీదు నుంచి తహసీల్దార్ కార్యలయం వరకు మౌళానాలు అబ్దుల్ సుబాన్, ఆరిఫ్‌ల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. వీరికి సిపిఐ నాయకులు రమేశ్, సిపిఎం నాయకులు, సామన్న, కాంగ్రెస్ నాయకులు షేక్షావలి మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ మైనార్టీల హక్కులను ముప్పుగా బావించే వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

## నేడు యథావిధిగా రిజిస్ట్రేషన్ సేవలు

**ఆత్మకూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):** రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు రెండో శనివారం కూడా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సేవలను అందుబాటులో ఉంచవచ్చునున్నట్లు ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్‌కరీం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఈ నెల 12వ తేది ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కార్యాలయాలన్నీ అందుబాటులో ఉంటాయని చెప్పారు.

## ఏఐకేఎస్ వ్యవస్థాపక దినోత్సవం

**ఆత్మకూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు పట్టణంలో శనివారం ఏఐకేఎస్ 90వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. నాయకులు వీరన్న, రణధీర్, నాగేశ్వరరావు, పాలశివుడు, అంబయ్య, నాగన్న, గణపతి తదితరులు ఉన్నారు.

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

**నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్లను ఆమె విడుదల చేశారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16న డోన్‌లోని జీవీఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాను యువత హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు. 15ప్రైవేట్ కంపెనీలు జాబ్‌మేళాలో ఉద్యోగాల భర్తీ చేపట్టనున్నట్లు చెప్పారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్ మెకానికల్, డీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, బి ఫార్మసీ, పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు హాజరు కావాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఇండస్ట్రీస్ జీఎం జవహర్‌బాబు, ఎస్సీ, ఎస్టీ చాంబర్‌ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజమహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో, బైకు ఢీ.. ఐదుగురికి గాయాలు

**మహానంది, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని నందిపల్లి మెట్ట వద్ద శుక్రవారం సాయంత్రం ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు. గాజులపల్లి నుంచి నంద్యాల వైపు వెళ్తున్న ఆటో, నందిపల్లి మెట్ట వద్ద ఎదురుగా వస్తున్న బైకు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాజులపల్లి, గోపవరం గ్రామాలకు చెందిన ఐదుగురు గాయపడగా 108 వాహనం ద్వారా నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## వేంపెంటలో విద్యుత్ అధికారుల దాడులు

**పాములపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** వేంపెంట గ్రామంలో విద్యుత్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. శుక్రవారం విద్యుత్ ఏడీ రామసుబ్రమణ్యం ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 12 మంది అక్రమంగా విద్యుత్ వాడుతున్న వారిపై కేసులు నమోదు చేశామని, ఏళ్ళ తరబడి బిల్లులు చెల్లించని బకాయి దారుల విద్యుత్ కనెక్షన్లను తొలగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ అబ్దుల్ హబీబ్, గోవిందరెడ్డి, ఏఎల్ఎం నాగిరెడ్డితో పాటు మరో 17 మంది విద్యుత్‌శాఖ సిబ్బంది ఈ దాడులలో పాల్గొన్నట్లు తెలిపారు.

## మహానందిలో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పూజలు



మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహులు దంపతులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

**మహానంది, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** మహానంది క్షేత్రం లో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహులు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆలయ ముఖమంటపం వద్ద వీరికి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, కోదండరామాలయంలో నామార్చన పూజలు చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం కల్యాణ మంటపంలో మెడికల్ డైరెక్టర్ దంపతులను వేదపండితులు ఆశీర్వదించారు. స్వామి వారి శాలువాతో సన్మానించి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు.

## శివభాష్యం గౌడ్ సేవలు మరువలేనివి



శివభాష్యంగౌడ్ సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న కుటుంబ సభ్యులు, గౌడ సంఘం నాయకులు

**ఆత్మకూరురూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):** వరదరాజస్వామి ప్రాజెక్టు కార్య సాధకుడు దివంగత శివభాష్యం గౌడ్ సేవలు మరువలేనివని గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేషన్న గౌడ్,సీనియర్ నాయకులు కాజన్న గౌడ్ లు అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండలంలోని నల్లమల అరణ్యంలోని వరదరాజస్వామి ప్రాజెక్టు వద్ద శివభాష్యం గౌడు 22వ వర్ధంతి కార్యక్రమాన్ని శివభాష్యం కుమారులు మల్లికార్జున గౌడ్, కరుణాకర్ గౌడ్, బుసగౌడు ,భాస్కర్‌గౌడుల ఆధ్వర్యంలో గౌడ సంఘం నాయకులు,కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ముందుగా శివభాష్యం సమాధి వద్ద ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఓబన్న గౌడ్, లింగన్న గౌడ్, హరి గౌడ్, హుసేనయ్య గౌడ్, భాస్కర్‌గౌడ్, సుబ్బరాయుడు గౌడ్, తిరమల్ గౌడ్, రామకృష్ణ గౌడ్, నరేంద్ర గౌడ్, వడ్లరామాపురం గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి: సీపీఐ

**నంద్యాల రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న వక్ఫ్ భూముల్లో పేద ముస్లింలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండు చేశారు. పట్టణంలోని కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గతంలో ఉన్న నాయకులు పేదలకు బాలాజీ కాంప్లెక్స్ ఉన్న వక్ఫ్‌బోర్డు భూముల్లో ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం ఉన్న నాయకులు అర్హులైన వారికి తప్పని సరిగా ఇళ్ల పట్టాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

## పోలీసుల విచారణ

**వెలుగోడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** వెలుగోడు పట్టణానికి చెందిన తన్వీర్ అనే యువకుడు క్రెడిట్ కార్డుల ద్వారా రూ. 11.50 లక్షలు మోసం చేసినట్లు విచారణలో తేలిందని సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన వెలుగోడు చేరుకొని తన్వీర్‌తో పాటు పలువురు బాధితులను పిలిపించి విచారించారు. తన్వీర్ వారి బంధువుల పేరిట వారి సహకారంతోనే ఖాతలు తెరిచి క్రెడిట్ కార్డులు పొంది లావాదేవీలు నడుపుతున్నట్లు తెలిపారు. తన్వీర్ ఇంకా 11.50 లక్షలు చెల్లించి వారి క్రెడిట్ కార్డులను వారికి అందిస్తామని తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):** పట్టణంలో డి1, డి2 సెక్షన్‌ల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. డి1 సెక్షన్ పరిధిలోని సంతగేట్, బాలకొండహాల్, గుడిపాటిగడ్డ, ముల్లాన్‌పేట, జగజ్జననీ నగర్, మూలమటం, మాల్దర్‌పేట, నడిగడ్డ, హరిజనవాడ,గాంధీచౌక్, ఫరూక్‌నగర్, బాలాజి కాంప్లెక్స్ శ్రీనివాసనగర్, చాంద్‌బాడ, మున్సిపల్ టౌన్‌హాల్, రోజకుంట, సంజీవనగర్, రైతుబజార్, రామనాథరెడ్డి నగర్, ఆర్టీసీ బస్టాండు, బైటిపేట, పెద్దబండ, తెలుగుపేట, సంగపేట, పప్పులబట్టీ బజార్‌లో విద్యుత్ సరఫరా నిలిపిస్తునటుట్ల తెలిపారు. డి2 సెక్షన్ పరిధిలో విజయ మిల్క్ డెయిరీ, ఎస్‌బీఐ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, నూనెపల్లి, గెలివి ఫ్యాక్టరీ ఏరియా, పద్మావతీ నగర్, ఎన్‌జీఓ కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ ఏరియా, టెక్కె ఏరియా, దేవనగర్, సాయిబాబానగర్, లలితనగర్, పాలిటెక్నిక్ కాలేజీ ఏరియా, గోపాల్‌నగర్ ఏరియాలలో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



చింతలపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

**మిడుతూరు, ఏప్రిల్ 11( ఆంధ్రజ్యోతి):** శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మండలంలోని చింతలపల్లి గ్రామంలో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు చట్టాలపై అవగాహన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్ఐ ఓబులేసు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

**ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** సిద్ధాపురం గ్రామ శివారులో సారా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామశివార్లలోని అటవీ ప్రాంతంలో సోదాలు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా ఆ గ్రామ శివార్లలోని పడమర దిశలోని అటవీ ప్రాంతంలో ఓ సారా స్థావరాన్ని గుర్తించి బట్టి వద్ద ఉన్న 1600 లీటర్ల బెల్లపు ఊటను, 10 లీటర్ల సారాను, సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు గ్రామానికి చెందిన మల్లికార్జున, రవికుమార్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ డీటీఎఫ్ సీఐ లక్ష్మణ్‌దాస్, ఎస్ఐలు రమేష్ ,జగదీష్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

**నంద్యాల టౌన్:** నంద్యాల ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఈఎస్ రవికుమార్ ఆదేశాల మేరకు నంద్యాల పట్టణంలోని దేవనగర్ లో నాటు సారా అమ్మే వారిపై దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి తెలిపారు. వారి వద్ద నుంచి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆళ్లగడ్డ కోర్టులో హాజరు పరచగా 15 రోజులు రిమాండు విధించినట్లు తెలిపారు. సారా అమ్మే వారి వివరాలు ఎవరికైనా తెలిసిన వారు వెంటనే 1440 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

## పైపులైన్ పనులను అడ్డుకున్న కౌన్సిలర్



పనులను అడ్డుకుంటున్న కౌన్సిలర్ చాంద్‌బాషా

**నందికొట్కూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** మచ్చుమర్రి నుంచి ఓర్వకల్లు పరిశ్రమల హబ్‌కు నీటిని తీసుకెళ్తేందుకు ఏర్పాటు చేస్తున్న పైపులైన్ పనులను 24వ వార్డు కౌన్సిలర్ చాంద్‌బాషా నందికొట్కూరు పట్టణ శివారులో అడ్డుకున్నారు. శుక్రవారం నందికొట్కూరు శివారులోని బ్రహ్మంగారి మఠం వద్ద జరుగుతుండగా అడ్డుకున్నారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో పైపులైన్ పనులు తీసుకెళ్తే ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారి వెంటనే తీసుకెళ్లడం సరికాదన్నారు. పట్టణంలో ఏడు అడుగుల లోతు, 1.8 మీటర్ల వెడల్పు పొడవునా ఈ కాలువను తీస్తే నందికొట్కూరు నుంచి పగిడ్యాల రోడ్డులో ఎలాంటి వాహనాలు తిరిగేందుకు అవకాశం ఉండదన్నారు. తాగునీటి పైపులైన్‌లు, డ్రైనేజీ కాలువలు అన్ని కూడా చిన్నాభిన్నం అవుతాయన్నారు. అసలే వేసవి కాలం తాగునీటి సమస్య తీవ్రంగా ఏర్పడుతుందన్నారు. పైపులైన్‌ను పట్టణంలో కాకుండా శివారులో తీసుకెళ్లాలన్నారు.

## పంటల పరిశీలన

**మహానంది, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని తమ్మడపల్లి, బొల్లవరం గ్రామాల్లోని రైతులు సాగు చేసిన వరిపంట ఈదురు గాలులకు నేలకూలిన పంటలను వాటిల్లినట్లు నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజశేఖర్ పరిశీలించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో రబీ సీజన్లో 7,100 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 4 వేల ఎకరాల్లో వరి పంట కోతలు పూర్తయ్యాయని తెలిపారు. వెయ్యి ఎకరాలు ఈదురు గాలులు, అకాల వర్షంకు నేలవాలినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు చెప్పారు. పంట నష్టం నివేదికలను ఉన్నతాధికార్లకు పంపామన్నారు. కార్యక్రమంలో ఏవో బి.నాగేశ్వరరెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

## 'పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

**ఆత్మకూరురూరల్ , ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):** కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మైనారిటీ మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా సూచించారు. సంజీవ్‌నగర్ తండాలో శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్ర మంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి, అక్కడి ప్రజలతో రచ్చ బండ కార్యక్రమంలో గ్రామ సమస్యలపై ఆరా తీశారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

**ఆత్మకూరురూరల్, ఏప్రిల్ 11 ( ఆంధ్రజ్యోతి):** ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివనాగ రాణి, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని కరివేన గ్రామంలో ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో నిర్వహించే జీపు జాతాను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి నరసింహనాయక్, బాలయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నాణ్యమైన ఆహారం అందించాలి



సున్నిపెంటలో తనిఖీ చేస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్

**సున్నిపెంట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):** నాణ్యమైన ఆహారం అందించాలని ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్త విజయప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం సున్నిపెంటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాలలు, పౌరసరఫరాల గోదాములను తనిఖీ చేశారు. గిరిజన కో-ఆపరేటివ్ సొసైటీలకు కాంట్రాక్టర్లు సరఫరా చేసే సరుకులలో నాణ్యత లేదని, ధరల్లో కూడా వ్యత్యాసం ఉందని అన్నారు. సున్నిపెంటలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో మెనూ ప్రకారం ఆహారం అందిచడం లేదని విద్యార్థులు చైర్మన్ దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన వార్డన్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు గిరిజన పాఠశాలల ప్రిన్సిపాళ్ల, వార్డన్లపై చర్యలకు ఆదేశించినట్లు కమిషన్ చైర్మన్ తెలిపారు. గిరిజన గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. రెండు నెలల్లో మళ్లీ వస్తానని, అప్పటిలోపు మార్పు రాకుంటే తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. 9966090123 నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందిస్తానని ఫుడ్ కమిషన్ చైర్మన్ తెలిపారు.

## త్వరలో భవన నిర్మాణాలు

**బనగానపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని తమ్మడపల్లె గ్రామంలో త్వరలో దోబీఘాట్, అంగన్‌వాడీ భవనం నిర్మిస్తామని టీడీపీ నాయకురాలు, మంత్రి బీసీ సతీమణి బీసీ ఇందిరమ్మ అన్నారు. శుక్రవారం తమ్మడపల్లె గ్రామంలో ఆమె పర్యటించారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో దోబీఘాట్, అంగన్‌వాడీ భవనం నిర్మిస్తామని మాట ఇచ్చామని త్వరలో నెరవేరుస్తామన్నారు. ఆమె వెంట టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలు

**కోవెలకుంట్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** అందరి సహకారంతో పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు బీవీ ప్రసాద్‌రెడ్డి సూచించారు. ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా ఎన్నుకోబడిన గుద్దేటి గుండయ్య, సభ్యులు శుక్రవారం ప్రసాద్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తనకు ఆలయ కమిటీ చైర్మన్‌గా రావడానికి కృషి చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెనుగొండ రాజశేఖర్, మురళి, నాగేంద్ర, చెన్నకేశవులు, కొమ్ము రాజు పాల్గొన్నారు.


బీవీ ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ గుద్దేటి గుండయ్య

## టీడీపీతోనే పేదల సంక్షేమం

**చాగలమర్రి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్ బాషా తెలిపారు. శుక్రవారం చాగలమర్రి టీడీపీ కార్యాలయంలో సభ్యత్వం తీసుకున్న వారికి బూత్‌ల వారీగా కార్డుల బాక్సులను బూత్ ఇన్‌చార్జిలకు అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి అజీమ్, కార్యదర్శి అనిఫ్, టీడీపీ నాయకులు జెట్టి నాగరాజు, కొలిమిసోను, గఫార్, మురళీ, ఇంతియాజ్, రాజేష్, నూర్‌బాష, బషీర్ పాల్గొన్నారు.


చాగలమర్రిలో టీడీపీ సభ్యత్వ కార్డులను అందజేస్తున్న అన్సర్‌బాషా

## నేటి నుంచి ప్రతిష్ఠ పూజలు

**రుద్రవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** రుద్రవరం సమీపంలోని దొర్నిపాడు చెంచులక్ష్మి లక్ష్మీనరసింహస్వామి ప్రతిష్ఠ పూజలు శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు తెలిపారు. 12న గోపూజ గంగ పూజ, గణపతిపూజ, 13న ప్రాతఃకాల పూజ, ప్రతిష్ఠ హోమం, 14న యంత్రాభిషేకం, యంత్రస్థాపనం, ధ్వజ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధ్వజ శిఖర కలశ, నాగప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

## గ్రామాల్లో నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

**చాగలమర్రి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృష్టి ఉంచామని జిల్లా పంచాయతీ అధికారి జమివుల్లా తెలిపారు. శుక్రవారం మండలంలోని మద్దూరు గ్రామంలోగల సచివాలయాన్ని తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి చిన్నబ్బి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


మద్దూరు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా డీపీవో జమివుల్లా

## బావిలో బయటపడిన రాతి ప్రమిద

**కొలిమిగుండ్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని నందిపాడు గ్రామంలో క్రీ.శ 12వ శతాబ్దంలో నిర్మించిన చౌడేశ్వరి ఆలయ ఆవరణంలోని పురాతన బావి పూడికతీత పనుల్లో రాతితో తయారు చేసిన దీపం ప్రమిద శుక్రవారం బయట పడింది. సహజంగా దీపం కుందులను మట్టితో తయారు చేస్తారు. అయితే ఈ ఆలయంలో ఎర్ర రాతితో తయారు చేసిన దీపం ప్రమిద లభించింది. బయటకు తీసే సమయంలో గడ్డ పారతో కొట్టినా పగిలి పోలేదని గ్రామస్థులు తెలిపారు. దీనికి గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మరోవైపు బావిలో పూడికతీత పనులు చేస్తుండగా, నీటిఊట ప్రారంభమైనట్లు గ్రామస్థులు తెలిపారు.


రాతి ప్రమిద

## సూర్యఘర్ యోజనతో విద్యుత్ బిల్లు ఆదా

**దొర్నిపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** పీఎం సూర్యఘర్ పథకంతో వినియోగదారులకు విద్యుత్ బిల్లు ఆదా అవుతుందని కోవెలకుంట్ల ఏడీఈ సతీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్పెషల్ అధికారి గోవిందనాయక్ ఆధ్వర్యంలో సిబ్బందికి పీఎం సూర్యఘర్ పథకంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో విద్యుత్ ఏఈ అనంతరావు, ఎంపీడీవో సావిత్ర, తహసీల్దార్ సుభద్ర, లైన్‌ఇన్‌స్పెక్టర్ కుక్కలయ్య, సిబ్బంది శ్రీనివాసరెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగయ్య, మనోహర్, సురేంద్ర, హరి, వంశీ, శివ, పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నీటి వనరులపై అవగాహన పెంచుకోవాలి

**ఉయ్యాలవాడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):** గ్రామాల్లో ఉన్న నీటి వనరులపై అవగాహన పెంచుకోవాలని ఏడీ ఓబులేసు సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శ్రీనివాసులుతో కలిసి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌బాబు, ఏఎస్‌వో తదితరులున్నారు.

## ప్రహ్లాద వరద స్వామికి విశేష పూజలు

**ఆళ్లగడ్డ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** అహోబిళంలో శుక్రవారం ప్రహ్లాద వరద స్వామికి విశేష పూజలు తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు కిడాంబి మధుసూదనాచార్యులు మాట్లాడుతూ పంగుని ఉతిరం అనేది ఒక తమిళ హిందూ పండుగ అని తెలిపారు. పంగుని మాసం పూర్ణిమ నాడు చేస్తారన్నారు. ఇది తమిళ క్యాలెండర్‌లో చివరి నెల అని వివరించారు. స్వామివారికి అభిషేకం ప్రత్యేక పూజలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మణియర్ సౌమ్యనారాయణ, అర్చకులు పాల్గొన్నారు.

## నాటుసారా విక్రేత అరెస్ట్

### రిమాండుకు తరలింపు

**కొలిమిగుండ్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని కోటపాడు గ్రామ సమీపంలోని నీళ్ల ట్యాంకు వద్ద శుక్రవారం నాటుసారా విక్రేతను అరెస్ట్ చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు వెల్లడించారు. గ్రామానికి చెందిన మాదిగ చిన్నరాముడు నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకొని సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితున్ని బనగానపల్లె కోర్టులో హాజరుపరచగా, మేజిస్ట్రేట్ 14రోజులు రిమాండు విధించినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

# పని చేసినా.. పస్తులేనా?

- మూడు నెలలుగా అందని 'ఉపాధి' వేతనాలు
- ఆవేదనలో కూలీలు

**ప్యాపిలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం బిల్లుల చెల్లింపులు అస్తవ్యస్తంగా మారాయి. బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో కూలీలు ఏమి చేయాలో దిక్కుతోచక లబోదిబోమంటున్నారు. రెక్కలు ముక్కలయ్యేలా కష్టం చేసినా పస్తులు ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో దాదాపు ఐదు వేల మంది ఉపాధి కూలీలు ఉన్నారు. వీరంతా కూడా ఈ పథకం మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయ పనులు పూర్తికాగానే గత ఏడాది నవంబరు నుంచి ఉపాధి పనులను ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాల్లో వలసలు వెళ్లకుండా ఉపాధి పనులను నమ్ముకొని స్థానికంగానే ఉన్నారు. అయితే పనులను చేయించుకుంటున్న అధికారులు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అప్పులు చేసి జీవనం సాగిస్తున్నారు.


ప్యాపిలిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

**ఎప్పుడు ఇస్తారో తెలియదు**

గత ఏడాది నవంబరు నుంచి ఇప్పటి వరకు కూలీలు ఉపాధి పనులు చేశారు. అయితే ఇటీవల రెండు నెలల బిల్లులు చెల్లించారు. ఇంకా మూడు నెలల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఆ బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారో తెలియదు. నెలల కొద్ది బిల్లులు చెల్లించకపోతే తాము ఎలా బతకాలని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి పనుల కన్న వలసలే నయమని వారు వాపోతున్నారు.

**లోపించిన అధికారుల పర్యవేక్షణ**

బిల్లుల గురించి అడుగుదామంటే మండల అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. కూలీల సమస్యల గురించి తెలుసుకొని పరిష్కరించాల్సిన మండలస్థాయి అధికారి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చేసిన పనికి సరిపడా డబ్బులు రావడం లేదని కూలీలు వాపోతున్నారు. ఉన్నతాధికారుల స్పందించి స్థానిక మండల స్థాయి అధికారులు ఉపాధి పనులను పర్యవేక్షించి తమ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

### రుద్రవరం మండలంలో..

**రుద్రవరం:** రుద్రవరం మండలంలో 9842 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఉపాధి కూలీలు 18776 మంది ఉండగా, 14709 మంది ఉపాధి కూలీలు రన్నింగ్‌లో ఉన్నారన్నారు. పనికి మాత్రం అరకొర గానే కూలీలు హాజరవుతున్నారు. రుద్రవరం మండలంలో జనవరి నుంచి ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలు అందడంలేదు. వేతనం కోసం ఎదురు చూ స్తున్నా ఫలితం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబాలు పోషణ కూడా కష్టమవుతుందని వాపోయారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా వేతనాలు ఇవ్వడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఏమి తిని ఉపాధి పనులు చేయాలని కూలీలు ప్రశ్నిస్తున్నారు. ఎంపీడీవో భాగ్యలక్ష్మిని వివరణ కోరగా వేతనాలు చెల్లించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.


రుద్రవరంలో పనులు చేస్తున్న కూలీలు

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : మంత్రి బీసీ

**బనగానపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** బనగానపల్లె నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎస్సార్బీసీ కెనాల్‌కు ఇరువైపులా చేపట్టిన జంగిల్ క్లియరెన్సు పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సార్బీసీ కాల్వకు ఇరువైపులా ఉన్న ముళ్ల కంపలను తొలగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వ వ్యవసాయం, విద్య, రోడ్లు భవనాలు, వైద్యంతో పాటు సాగు, తాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. జంగిల్ క్లియరెన్సు పనులు వేగవంతం చేయాలని మంత్రి ఎస్సార్బీసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అమరనాథ్‌రెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

**నేషనల్ హైవే కల్వర్టు పనుల పరిశీలన**

మండలంలోని పండ్లాపురం వద్ద జరుగుతున్న నేషనల్ హైవే కల్వర్టు పనులు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. నేషనల్ హైవే కల్వర్టు పనులతో పాటు డైవర్షన్ రోడ్డు పనులు పరిశీలించారు. నేషనల్ హైవే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా హైవే పనులు వేగవంతం చేయాలన్నారు. అధికారులు నిత్యం పర్యవేక్షించి నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు.

## కంబగిరి స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

**అవుకు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** అవుకు మండలం ఎర్రమల కొండపై వెలసిన లక్ష్మి కంబగిరిస్వామి ఆలయాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. కంబగిరిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయం వద్దకు చేరుకున్న మంత్రి బీసీ ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మలకు టీడీపీ నాయకులు, ఈవో రామకృష్ణ, గూడాల ప్రతాప్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, అవుకు మండల టీడీపీ అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, చల్లా విజయభాస్కర్‌రెడ్డి, మొట్ట రామిరెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అర్చకులు పూర్ణ కుంభంతో బీసీ దంపతులకు స్వాగతం పలికారు. మంత్రి దంపతులు కంబగిరి స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు బీసీ దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణనాయక్, అరుణ్ కుమార్‌నాయక్, దంతెల రమణ, తిక్కన్న, మారం భాస్కర్‌రెడ్డి, ఆకుల నాగిరెడ్డి, ఇస్మాయిల్ ఖాన్, రామకృష్ణారెడ్డి, తిరుమలయ్య, బాలనాగిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి దంపతులు

**నేడు కంబగిరిస్వామి కల్యాణం**

అమ్మవారి కల్యాణోత్సవ కార్యక్రమాన్ని శనివారం తెల్లవారుజామున నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్నారు. బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి, నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి, అవుకు ఎస్ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# చాగలమర్రిలో వర్షం

**చాగలమర్రి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కౌలు రైతు ఫయాజ్ మూడెకరాల్లో సాగు చేసిన మునగ చెట్లు విరిగిపడ్డాయి. రూ.లక్ష దాక నష్టం వాటిల్లింది. కోతకు వచ్చే సమయం లో గాలుల వల్ల మునగ చెట్లు దెబ్బతిని నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలనిన్నారు.


రుద్రవరం తడిసిన మొక్కజొన్న ధాన్యం


విరిగిన మునగ చెట్లు

**రుద్రవరం:** రుద్రవరం మండలంలో అకాల వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, గాలివాన కురియడంతో రహదారులపై ఆరబోసిన మొక్కజొన్నలు, వరి ధాన్యం తడిచిపోయింది. ముత్తలూరు, నరసాపురం గ్రామాల్లో తడిచిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న పంట నేలకు వాల్లిందని రైతులు తెలిపారు.

## విద్యా చైతన్య సదస్సును జయప్రదం చేయాలి

**ప్యాపిలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** కర్నూలులో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించనున్న విద్యా చైతన్య సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ అధ్యక్షురాలు శాంతిప్రియ కోరారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సంఘం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ చైతన్య సదస్సులో విద్యారంగంలో నెలకొన్న వివిధ సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లతీఫ్, నరసింహారెడ్డి, నెల్లూరప్ప, ఆంజనేయప్రసాద్, రాజేంద్ర పాల్గొన్నారు.

## ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకీ ఉత్సవం

**బనగానపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం శ్రీ చౌడేశ్వరీమాత పల్లకీసేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈవో కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

## పేద వధువులకు పెళ్లి కానుకలు


పేద వధువులకు పెళ్లి కానుకలను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

**బనగానపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి శుక్రవారం పేద వధువులకు పెళ్లికానుకలు అందించారు. తన తల్లిదండ్రులు బీసీ గురెడ్డి, లక్ష్మమ్మల జ్ఞాపకార్థం 2022లో పెళ్లికానుకల పంపిణీని ప్రారంభించి నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నామన్నారు. బనగానపల్లె, తమ్మడపల్లెకు చెందిన పేద వధువులకు పెళ్లి కానుకలు అందించినట్లు తెలిపారు.

**వెంకటసుబ్బారెడ్డి మృతికి నివాళి:** బనగానపల్లె పట్టణంలోని కరణం మొహిద్దీన్ కాలనీలోని సొసైటీ రిటైర్డు మేనేజరు వెంకటసుబ్బారెడ్డి (71) మృతి తీరని లోటు అని పట్టణమాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన వెంకటసుబ్బారెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## 'న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి'

**బనగానపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఆర్టీసీ డిపో సెక్రటరీ శ్రీనివాసులు కోరారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం బనగానపల్లె ఆర్టీసీ డిపో ఆవరణంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కేపీ ఓబులేసు, గ్యారేజి సెక్రటరీ దేవేందర్‌రెడ్డి, గఫూర్, ట్రెజరర్ జి.వెంకటేశ్వర్లు, బాబు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

**ఆళ్లగడ్డ:** తమ సమస్యలు పరిష్కరించాలని ఆళ్లగడ్డ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ నాయకులు శుక్రవారం రెండో రోజు డిపో గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం తమ డిమాండ్ లను నెరవేర్చే వరకు తమ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ ఎన్‌కే రావు, అధ్యక్షుడు పీవీ రెడ్డి, కార్యదర్శి రాజశేఖర్, గ్యారెజ్ కార్యదర్శి రమణ, సభ్యులు ప్రసాద్, జనార్దన్, రమణ, రసూల్, సుబ్బారావు, రోషయ్య గ్యారేజ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఈజీఎస్ ఇంజనీర్ సస్పెన్షన్

**బనగానపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** బనగానపల్లె మండలంలో పనిచేస్తూ ఇటీవల జూపాడు బంగ్లాకు బదిలీ అయిన ఎన్ఆర్ ఈజీఎస్ ఇంజనీరింగ్ మగ్బుల్‌హుస్సేన్‌ను సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో రమణ శుక్రవారం తెలిపారు. బనగానపల్లెలో పనిచేస్తూ పని వేళల్లో ఫీల్డ్ సరిగా తిరగకపోవడం, కన్సల్టెన్సీ పెట్టి సొంత పనులు చేసుకోవడం, ఉపాధి నిధులు పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. పసుపుల గ్రామానికి చెందిన రామాంజనేయులుకు హార్టికల్చర్ ద్వారా సెరికల్చర్ షెడ్ నిర్మించుకున్నా బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యం వహించినందుకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

## పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి

**కొలిమిగుండ్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) :** అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని మహిళలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం పోషణ్ పక్వాడ .. కార్యక్రమంపై మహిళలకు ఐసీడీఎస్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఇటిక్యాల, చింతలాయపల్లె, కోరుమానుపల్లె, అబ్దుల్లాపురం, మదనంతపురం తదితర గ్రామాల్లో సీడీపీవో ఉమామహేశ్వరమ్మ, సూపర్‌వైజరు పద్మావతి పర్యటించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యలక్ష్మీ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించం

**సంజామల,ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించమని కోవెలకుంట్ల సీఐ హనుమంతు నాయక్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండు వద్ద గ్రామస్థులతో సమావేశమయ్యారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ నాగన్న, సిబ్బంది , గ్రామస్థులు పాల్గొన్నారు.

# జ్యోతిబా పూలేకి ఘన నివాళి

**ప్యాపిలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవాపథ్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, నవీన్‌పాటి, సత్యబాబు, వెంకటరమణ పాల్గొన్నారు.

**బనగానపల్లె:** బనగానపల్లె పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో మహాత్మా జ్యోతి బా పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మధుసూధన్‌రావు, అ ధ్యాపకులు పల్లె కృష్ణుడు , వెంకటేశ్, వీరన్న, వెంకటకృష్ణుడు, వి.సుబ్బరాయుడు, పోలియానాయక్, రమేశ్, యాగంటప్ప, శేఖర్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.



బనగానపల్లెలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

**చాగలమర్రి:** బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి మహాత్మా జ్యోతి బా పూలే జయంతి వేడుకలను శుక్రవారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, రామతీర్థం పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యా లయంలో ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. కా ర్యక్రమంలో బీసీ సంఘ నాయకులు పీరయ్య, రామ కృష్ణ, సుబ్బరాయుడు, లాలయ్య, సిద్ధప్ప, రమణయ్య, చిన్నికృష్ణయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


కోవెలకుంట్లలో..

**రుద్రవరం:** దేశంలోనే గొప్ప సంఘ సంస్కర్త జ్యోతి బా పూలే అని ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు అ న్నారు. శుక్రవారం పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


డోన్‌లో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ ప్రసాద్‌గౌడు

**ఆళ్లగడ్డ:** ఆళ్లగడ్డలోని ఇండియన్ గ్లోబోల్ ఉన్నత పాఠశాలలో మహాత్మా జ్యోతి బా పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. జ్యోతి రావు పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

అలాగే ఆళ్లగడ్డ లోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గంగన్న ఆధ్వర్యంలో జ్యోతి రావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రాజు, నాగమస్తాన్, విజయలక్ష్మి, వెంకట సుబ్బయ్య, జయచంద్ర, వెంకటేష్ కుమార్, ఉసేనయ్య, కాశివిశ్వనా థ్, స్వరూప పాల్గొన్నారు.

**డోన్ టౌన్:** మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీ య మని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు అన్నారు. శుక్రవారం పట్టణం లోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్, కమిషనర్లు వేరు వేరుగా మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఈ రఘు, ఏఈ సురేష్, మేనేజర్ హరీఫ్, ఆర్ఐ మోహన్ తదితరులు పాల్గొన్నారు.


చాగలమర్రిలో..